క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్-1, స్ట్రీట్ నెంబర్-2, స్ట్రీట్ నెంబర్-3, ఐడీబీఐ క్వార్టర్స్, బ్రహ్మ కుమారీస్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ



స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి వార్డు కార్యాలయంలో యువకులకు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించేందుకు యువత కష్టపడాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. లింగంపల్లి విలేజ్, సురభీకాలనీ, గోపీనగర్, నెహ్రూనగర్ యువకులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ అధ్యక్షులు గడ్డం రవియాదవ్, వెంకట్‌రెడ్డి, రాజుయాదవ్, కిరణ్, గఫర్, మహేందర్ సింగ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన ఫీల్డ్ విజిట్

పటాన్‌చెరు టౌన్: స్టార్టప్‌లు, వర్ధమాన పారిశ్రామికవేత్తలను సన్నద్ధం చేసే లక్ష్యంతో గీతం హైదరాబాద్ లోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ) నిర్వహిస్తున్న 'సమ్మర్ స్టార్టప్ స్కూల్'లో భాగంగా 'డిజైన్ థింకింగ్ వర్క్‌షాపు, వెంచర్ ఫారెస్ట్ ట్రయల్స్' క్షేత్ర స్థాయి పర్యటన ఆదివారం విజయవంతంగా ముగిశాయి. సమస్య-పరిష్కార నైపుణ్యాలు, ఆవిష్కరణ వ్యూహాలతో కూడిన ఈ వర్క్‌షాపును వీడీసీ సీనియర్ వెంచర్ కోచ్‌లు వాసుదేవ్, రాపేటి నిర్వహించారు. క్షేత్ర పర్యటనను వారు పర్యవేక్షించారు. వ్యాపారం విజయవంతం కావాలంటే వినియోగదారుల అవసరాలపై లోతైన అవగాహనను ఏర్పరచుకోవడం, సృజనాత్మకంగా యోచించడం వంటి మెళకువలను వివరించారు. ఈ ప్రపంచ సంక్షోభానికి వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి 'జీవవైవిధ్య నష్టం' అనే ఇతివృత్తంతో సమస్య-పరిష్కారానికి మానవ-కేంద్రీకృత విధానంపై ఈ కార్యశాల దృష్టి సారించడంతో పాటు స్టార్టప్ల విజయంలో దానిపాత్రను వివరించారు. సవాళ్లను సరికొత్త దృక్పథంతో ఎదుర్కోవడానికి, ఆవిష్కరణలు చేయడానికి, వినియోగదారులకు అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులు, సేవలు అందించడానికి ఈ కార్యక్రమంలో చేసిన మార్గదర్శనం తమకు ఎంతో తోడ్పడుతుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అలాగే క్షేత్ర పర్యటన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందన్నారు.

అన్నివర్గాలకు సమప్రాధాన్యం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: అన్నివర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని, పద్మశాలీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ కోకాపేటలో భవననిర్మాణానికి విలువైన 2.5 ఎకరాల భూమి కేటాయించడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కిషోర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్, జనరల్ సెక్రటరీ నరేశ్ నారాయణ, దేవీ ప్రవీణ్, సత్యనారాయణ, మురళి పాల్గొన్నారు.

సీసీరోడ్ల పరిశీలన

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని మాధవినగర్‌లో పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను స్థానికులు, సంబంధిత అధికారులతో ఆదివారం స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పాదయాత్ర చేపట్టి తెలుసుకున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ రూ.30లక్షల నిధులతో చేపట్టామన్నారు. పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఏఈ పవన్, ముకుందం, వెంకట్‌రెడ్డి, జగదీష్, బాగయ్య పాల్గొన్నారు.









క్షణ..క్షణం.. భయం..భయం..

ప్రమాదకరంగా పురాతన విద్యుత్ స్తంభాలు

- తుప్పపట్టిపోతున్నా పట్టించుకోని అధికారులు
- వర్షాకాలంలో ఏటా ప్రమాదాలు
- సబ్‌స్టేషన్‌ను షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలికి మార్చాలని డిమాండ్
- రాయదుర్గంలోనే ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి
- ఇదీ రాయదుర్గంలోని విద్యుత్ సమస్యల పరిస్థితి'

రాయదుర్గం: హైటెక్ ప్రాంతంగా గుర్తింపు పొందిన శేరిలింగంపల్లిలో భాగమైన రాయదుర్గం పరిధిలో ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాల కారణంగా ప్రజలు ప్రతి రోజూ భయం..భయంగా కాలం గడుపుతున్నారు. విద్యుత్ సరఫరా, నిర్వహణ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉండటంతో పట్టించుకునేవారు కరువయ్యారు. కేవలం రాయదుర్గం ప్రాంతాన్ని మాత్రమే షేక్‌పేట్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ కిందకు వదిలేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలి పరిధిలోకి మార్చాలనే ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. లేని పక్షంలో రాయదుర్గంలోనే ప్రత్యేకంగా సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఐరన్ స్తంభాలతో అవస్థలు..

- రాయదుర్గంలో ప్రాంతంలో ఇప్పటికీ పురాతన ఐరన్ విద్యుత్ స్తంభాల కారణంగా ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.
- వాటిలో చాలా వరకు తుప్పు పట్టి పోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కొన్ని స్తంభాలకు స్థానికులే ప్లాస్టిక్ కవర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.
- సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





- వర్షాకాలంలో ఎవరైనా పట్టుకుంటే షాక్ కొడుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ఐరన్ స్తంభాల స్థానంలో కొత్తగా సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం శూన్యం.
- విద్యుత్ సమస్యల తలెత్తినా అధికారులు స్పందించడం లేదని ఆయా ప్రాంతాలవాసులు వాపోతున్నారు.
- షేక్‌పేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రాయదుర్గం ప్రాంతాన్ని గచ్చిబౌలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోకి మార్చాలని కోరుతున్నారు.
- రాయదుర్గంలో ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు
- రాయదుర్గంలోని ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా రూ. కోట్లల్లో ఆదాయం పొందుతున్న ప్రభుత్వం విద్యుత్ సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



రాయదుర్గంలో ప్రస్తుత ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలి. స్థానిక బస్తీలు, గల్లీల్లో విద్యుత్ స్తంభాల కారణంగా వర్షాకాలంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి. – నిఖిల్‌యాదవ్, రాయదుర్గం

షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలికి మార్చాలి



శేరిలింగంపల్లి పరిధిలోని రాయదుర్గం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉంది. దీంతో సంబంధిత అధికారులు ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాయదుర్గంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి శేరిలింగంపల్లి విద్యుత్ విభాగం పరిధిలోకి మారిస్తే సమస్య లు పరిష్కామవుతాయి. లేని పక్షంలో గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలోకి మార్చేలా చర్యలు తీసుకోవాలి.

– దారుగుపల్లి నరేష్, రాయదుర్గం

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వరంగల్‌కు చెందిన పరమేశ్వర్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో గణనాయక, తాండవ నృత్యకారి, కాలబైరవాష్టకం, పలుకే బంగారమాయే, ఇదిగో భద్రాద్రి, జతిస్వరం, బ్రహ్మాంజలి, శ్రీరామనీనామ, తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు సుప్రజ, గాయత్రి, సహస్ర, మనస్విని, అనిమిషా, హిమాంశు, ఇందుప్రియ, సిరి, సుహాసిని, ప్రియదర్శిని, మహి, కృతిక, వాహిని, నిత్యశ్రీ, రిశ్విత, చైత్ర, ఐశ్వర్య, వంశిక, చేతన తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ సామాజిక వేత్త రఘు అరికపూడి, నరేందర్‌గౌడ్, లవ్ ఫర్ కౌ చైర్మన్ జెస్వంత్‌బాయ్ పటేల్ కళాకారులను సత్కరించి నాట్య రత్న పురస్కారాలను అందజేశారు.



ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను జయప్రదం చేయండి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కిర్బి యూనియన్ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండలంలోని పాశమైలారంలో జరిగిన కిర్బి కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ ఏర్పడిన తర్వాతనే దేశంలో ఐక్య పోరాటాలు వచ్చాయని, కార్మికులు ఏకమయ్యారని గుర్తు చేశారు. పాలకులు తెచ్చే కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయూ అన్నారు. ఐక్యత, పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడిందన్నారు. దేశం కోసం, ప్రజల కోసం, నిరుద్యోగుల కోసం, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా, విచ్ఛిన్నకర ఉద్యమాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ప్రైవేటు విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాడిన సంఘం సీఐటీయూ అన్నారు. రెండో లేబర్ కమిషన్ సిఫార్సులు, ప్రస్తుత మోడీ తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం సీఐటీయూతోనే సాధ్యమన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికులందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈనెల 30వ తేదీన జరిగే సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, సాండ్విక్ యూనియన్ ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లను రెగ్యులరైజ్ చేయాలి



ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సమావేశానికి హాజరైన సభ్యులు

హఫీజ్‌పేట్: నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లను రెగ్యులరైజ్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్స్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి బి.నరేష్ కుమార్ అన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్‌లో ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందు వరుసలో నిలబడి పోరాడామన్నారు. ఇప్పుడు కూడా అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ సమన్వయంతో పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలన్నారు. అనంతరం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులుగా వి.వెంకటేష్, పద్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుక, ట్రెజరర్ రాజశేఖర్‌రెడ్డి, చీఫ్ అడ్వైజర్ అబ్దుల్ సమీ, మీడియా ఇన్‌చార్జ్ పండరీ రెడ్డి, సభ్యులు రాఘవేంద్ర, గిరిరాజ, క్రాంతి, ప్రసన్న, రజిత, మాధవి, ఫోరా, స్వప్న, అనురాధ, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

మంచి కథకుడు ముదిగొండ



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: సమకాలీన సమస్యలకు పరిష్కారాల్ని సూచించే మంచి కథకుడు ముదిగొండ అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. చింతన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన 'సాహిత్యా కళా తాత్త్వికమూర్తిమత్వం ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య సాహితీ వ్యక్తిత్వం' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. హెచ్‌సీయూ నుంచి ఆన్‌లైన్‌లో ఆయన మాట్లాడుతూ ముదిగొండ వీరభద్రయ్య సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులుగా సుదీర్ఘకాలంపాటు పనిచేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లో గౌరవ ఆచార్యులుగా పనిచేశారన్నారు. జీవితంలో అసహనానికి, అశాంతికి, ఒంటరితనానికి కారణాలు తెలియాలంటే ఆయన కథలు చదవాలన్నారు, జీవితాలను సరిదిద్దుకునేందుకు ఈ కథలు దోహదపడతాయన్నారు. నైతికతకు, జీవితంలో అనివార్యమైన సామాజిక సర్దుబాట్లకు మధ్య గల వ్యత్యాసాల్ని తెలియజేస్తూనే, ఉత్తమ మూర్తిమత్వాన్ని పెంపొందించే కథలుగా వ్యాఖ్యానించారు. సమాజ గౌరవ మర్యాదలు పొందడమెంత ముఖ్యమో, అవి మనిషి అంతరంగ సంఘర్షణకు గురికాకుండా కాపాడాలనీ, అలా కాపాడుకోవాలంటే మనిషి తనలో తాను చూసుకోగలిగినప్పుడే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం సెక్లార్ ఎలక్ట్రికల్ ఏఈ శరత్ బాబు, భాగ్యనగర్ ఎలక్ట్రికల్ ఏఈ షేక్ షాబాజ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న విద్యుత్ సమస్యలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త స్తంభాల ప్రతిపాదనలు, సింగిల్ ఫేజ్, థర్డ్ ఫేజ్ సమస్యలు, వేలాడుతున్న కరెంట్ తీగల సమస్యలపై చర్చించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, వెంకట్‌నాయక్, యడ్ల సత్యనారాయణ, వాసుదేవరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం



గోపీనగర్‌లో పర్యటిస్తున్న గజ్జెల యోగానంద్

శేరిలింగంపల్లి: తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్ అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం రాత్రి శేరిలింగంపల్లి గోపీనగర్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ అబద్ధపు హామీలను ప్రజలు విశ్వసించరన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. శేరిలింగంపల్లి నుంచి అధిక ఆదాయ వనరులు ఉన్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు శెట్టి, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్య కురుమ, బాలరాజ్, శ్రీకాంత్, దయాకర్, శివకుమార్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకురాలు విజయశాంతి

మోతీనగర్: ఆలయాలు మనస్సుకు ప్రశాంతతను, భక్తి భావం పెంపొందిస్తాయని మాజీ పార్లమెంట్ సభ్యురాలు, బీజేపీ సీనియర్ నాయకురాలు, ప్రముఖ సినీ నటి విజయశాంతి పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. ఆదివారం ఈ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా విజయశాంతి ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీలక్ష్మీ యాదవ్, బొంతు హరికృష్ణ, చిలుకల కృష్ణారెడ్డి, ఏడుకొండలు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి

గచ్చిబౌలి: ప్రముఖ సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ బి బ్లాక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటేల్, పట్వారీ వ్యవస్థను రూపుమాపి అట్టడుగు వర్గాలకు న్యాయం చేసిన మహనీయుడని కొనియాడారు. వెండి తెరపై ఎన్నో పాత్రలకు జీవం పోసి ప్రపంచవ్యాప్తంగా అభిమానుల గుండెల్లో చిరస్థానం సంపాదించుకున్నాడన్నారు. అనంతరం రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, క్రాంతి కిరణ్, వెంకటేశ్వర్లు, మోహన్ రెడ్డి, ఎల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేపీ నగర్‌లో..

మియాపూర్: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా మియాపూర్‌లోని జేపీనగర్ వద్ద ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు మొవ్వ సత్యనారాయణ, అభిమానులు, నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మయూరీనగర్‌లోని వృద్ధాశ్రమంలో పండ్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఆర్‌కే ప్రసాద్, లీలా ప్రసాద్, సత్యనారాయణ, గిరి, సాంబయ్య, చక్రపాణీ, కీరాణీ ప్రసాద్, శ్రీధర్, జేపీ నగర్ కాలనీవాసులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



జేపీనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మొవ్వ సత్యనారాయణ

పీసీబీ అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమల నుంచి భారీగా వ్యర్థ ఘాటు వాసనలు రావటంతో శనివారం రాత్రి స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పీసీబీ టాస్క్‌ఫోర్స్ అధికారులు వెంకటేశ్ తదితరులు పారిశ్రామిక వాడలో పర్యటించి వాయ కాలుష్య నమోదు మిషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీసీబీ టాస్క్‌ఫోర్స్ అధికారి వెంకటేశ్ మాట్లాడుతూ ఘాటు వాసనలు వదిలే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించరు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మియాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ అహ్మద్ పాషా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మియాపూర్ మదీనాగూడలోని జాతీయ రహదారిపై ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం నడిచి వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి (40-45) స్పృహ తప్పి కిందపడ్డాడు. అతడిని గుర్తించిన స్థానికులు పక్కనే ఉన్న చెట్టు కిందకు తీసుకెళ్లి పరిచర్యలు చేసిన అనంతరం మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యవర్తిత్వంతోనే సమస్యల పరిష్కారం



సమావేశమైన డైమండ్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్

గచ్చిబౌలి: మధ్యవర్తిత్వం ద్వారానే ప్లాట్ల సమస్యలు పరిష్కారమవుతాయని డైమండ్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్లాట్ల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు సివిల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించిందన్నారు. ఈ క్రమంలోనే మై హోం గ్రూప్‌ను సంప్రదించి మధ్యవర్తిత్వం జరపాలని కోరినట్లు ప్లాట్ ఓనర్స్ తెలిపారు. ఇప్పటికే మై హోంకు ఎల్ఓఐ(లెటర్ ఆఫ్ ఇంటెంట్) ఇవ్వడం జరిగిందన్నారు. ప్లాట్ల సమస్యల కారణంగా మధ్య తరగతి వారు అమ్ముకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో డైమండ్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ డాక్టర్ పి.సుబ్బారెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, ఉమామహేశ్వర్ రెడ్డి, రాజేందర్, ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



రహమత్‌నగర్: వడ్డెర కులస్తుల సమస్యలను పరిష్కరించాలని వడ్డెర ఆత్మగౌరవ, భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ,డైరెక్టర్ ఎత్తరి అంతయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర కులస్తులకు విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. కష్టాన్ని నమ్ముకున్న వడ్డెర కులస్తులకు ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. దీనిపై మంత్రి హరీష్ రావు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు డా. ఒర్సు క్రిష్ణయ్య, బండారు శ్రీరాములు లింగయ్య, వెంకటేష్, పెంటేష్, వెంకటస్వామి, యాదయ్య, శేఖర్, కుమార్, శ్రీకాంత్, శివభూపతి, సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.